# కథావేదిక

ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకేచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారి, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.

## ఆహుతి

— కట్టా రాంబాబు

బెల్ కొట్టిన వెంటనే క్లాసు రూము నుంచి స్టాఫ్ రూముకొచ్చేసరికి టేబిల్ మీద టెలిగ్రాం వుంది. ఎక్కడ నుంచబ్బా అనుకుని కంగారుగా విప్పాను. 'వైశాలి ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అని వుంది. నాకు గుండాగినట్లయింది. వైశాలి చచ్చిపోయిందా?

అంకుల్... అంకుల్... అంటూ నా చుట్టూ చిన్నపిల్లలా తిరిగే వైశాలి చచ్చిపోయిందా?

ఏడ్వలేకపోతున్నాను. నాకే ఇంత బాధగా వుంటే మరి అనూరాధ, రాజారావులు ఎంత బాధపడుతూ వుండాలి. ఇంక తర్వాతి క్లాసుకెళ్ళాలనిపించలేదు. ప్రిన్సిపాల్‌గార్ని పర్మిషన్ అడిగి ఇంటికొచ్చేసాను. రెండు రోజులు లీవ్ కూడా పెట్టాను. నారాక శ్రీమతికి ఆశ్చర్యం కలిగించింది. ''ఏమిటలా వున్నారు?'' అనడిగింది. టెలిగ్రాం చూపించాను. ''నిజమా?'' అంది బాధగా. తనే సూట్‌కేస్ సర్ది అందించింది. భోజనం కూడా చెయ్యకుండా బయలుదేరాను.

• • •

యూనివర్సిటీలో చేరిన మొదటిరోజునే అనూరాధను చూసి చాలా ఆశ్చర్యపోయాను. ఇంత అందమైన వాళ్ళుంటారా అనుకున్నాను. అనూరాధది అసామాన్యమైన అందం. ఆమెతో స్నేహం చెయ్యాలని అందరూ తహతహలాడేవారు.

అనూరాధకు యూనివర్సిటీలో చేరేనాటికే పెళ్ళయింది. భర్త ఉద్యోగం చేస్తున్నాడు. అనూరాధ కోరిక మీదే ఆమెను చదివిస్తున్నాడు. అనూరాధది అందరితోను ఫ్రీగా వుండే మనస్తత్వం. ఆమెకున్న ఫ్రండ్స్‌లో బాయ్‌ఫ్రండ్సే ఎక్కువ. అయితే ఆమెకు ఎంతమంది స్నేహితులున్నా నన్ను ఆత్మీయుడిలా భావించేది. అనూరాధను చూడటానికి భర్త రాజారావు అప్పుడప్పుడు వస్తుండేవాడు. రాజారావు చాలా మంచివాడు. అతను నాకు మంచి స్నేహితుడయ్యాడు. వచ్చినప్పుడల్లా నన్ను కలవకుండా వెళ్ళేవాడు కాదు. వెళ్ళేముందు అంటుండేవాడు ''మీలాంటి మంచి మిత్రులు దొరికినందుకు మా అనూ చాలా అదృష్టవంతురాలు. మీరంతా వున్నారుకాబట్టే నేనక్కడ అనూ గురించి విచారం లేకుండా వుండగలుగుతున్నాను.'' అని.

అనూరాధ నాతో తన స్వంత విషయాలు చెబుతుండేది. తనకి చాలా చిన్నతనంలోనే పెళ్ళయిందని, భర్త రాజారావు దేవుడని తనకో కూతురు, కొడుకు వున్నారని, చదువంటే తనకి చాలా ఇష్టమని, పెళ్ళికి ముందు ఎప్పుడో ఆపేసిన చదువు పెళ్ళయి పిల్లలు పుట్టింతర్వాత కొనసాగించానని పి.జి. అయిన వెంటనే ఉద్యోగంలో చేరతానని చెబుతుండేది.

ఓసారి ఎగ్జిబిషన్‌లో అనూరాధ కన్పించింది. ఆమె కూడా ఆమెలాగే వున్న ఓ అమ్మాయి వుంది. ఆ అమ్మాయి అనూరాధ అంత పొడవే వుంది. సన్నగా చుడీదార్‌లో వుంది. పన్నెండేళ్ళ వయసుంటుంది. ఆ అమ్మాయిని చూసి అనూరాధ చెల్లెలనుకున్నాను. కాని అనూ





## టాస్

''చిన్నప్పుడు బొమ్మా...బొరుసు ఆటలాడుతూ అల్లరి చిల్లరిగా తిరిగేవాడివి. ఇప్పుడేం చేస్తున్నావ్?'' చాలా కాలానికి కలిసిన చంద్రాన్ని అడిగాడు సూర్యం.

''నేషనల్‌గేమ్స్‌కు ఎంపైర్‌గా వుంటున్నాను. ఆటల ప్రారంభానికి ముందు టాస్ వేసేవాణ్ణి నేనే'' చెప్పాడు చంద్రం.

-సూర్యచంద్ర (తుని)

## పట్టుచీర

''డాక్టర్‌గారూ! ఆవిడకు కడుపులో మంట తగ్గాలంటే ఏం చేయాలండీ''

''మీ ప్రక్కింటావిడను రోజుకో పట్టుచీర కట్టుకోవద్దనండీ''

## ఎంపిక

''మీకసలు బుద్ధుందా పుచ్చుపోయిన వంకాయలు తెచ్చారు. మీకసలు మంచివాటిని ఎంపిక చేసుకోవడం తెలియదు''

''నాకు ఆ విషయం నిన్ను పెళ్లిచేసుకున్నాక తెల్సిందిలే''


## చదువు

''నాన్న నేను చదువు మానేయాలనుకుంటున్నాను''

''అదేమిట్రా''

''మరి నువ్వే కదా చదువుకునే పిల్లలు సిగరెట్ కాల్చకూడదన్నావు''

-సిహెచ్‌వివిఎస్ మూర్తి (కొమరగిరిపట్నం)




రాధ ''మా అమ్మాయి వైశాలి'' అని పరిచయం చేసేసరికి ఆశ్చర్యపోయాను. వైశాలి ఎయిత్‌క్లాసు చదువుతుందట. పెళ్ళయిన సంవత్సరానికే పుట్టిందట. బాగా చదువుతుందట. ఎప్పుడూ స్కూలు ఫస్టేనట. యూనివర్సిటీ చూస్తానంటే తీసుకొచ్చిందట. వైశాలి నన్ను అంకుల్ అంటూ ఎంతో ఆత్మీయంగా పిలిచేది. అప్పుడప్పుడు శలవుల్లో నేను ఇంటికి వెళ్ళేటప్పుడు అనూరాధ వాళ్ళూరిలో ఆగి ఒకరోజు వాళ్ళింట్లో వుండి వెళుతుండేవాడిని. ఆ కుటుంబానికి నేను ఫామిలీ ఫ్రెండ్‌నయిపోయానని చెప్పాలి. నేను వెళ్ళినప్పుడల్లా వైశాలి నాతో ఎన్నో కబుర్లు చెప్పేది. ఎన్నెన్నో విషయాలు చర్చించేది. ఆ అమ్మాయి తెలివితేటలు చూస్తే నాకే ఆశ్చర్యమేసేది. యింత అందం, తెలివితేటలున్న అమ్మాయి భవిష్యత్‌లో చాలా ఉన్నత స్థితిలో వుంటుందనిపించేది.

మేం ఫైనలియరుకొచ్చాము. యూనివర్సిటీలో అనూరాధ ప్రవర్తన నాకు కోపం తెప్పించేది. ఎప్పుడూ అబ్బాయిలతో తిరుగుతుండేది. క్లాసులెగ్గొట్టి వాళ్ళతో సినిమాలకు, పిక్నిక్‌లకు పోతుండేది. ఒకసారి నేనామెతో అనడం కూడా జరిగింది, అలా తిరగడం మంచిది కాదేమోనని. దానికి నవ్వి ''నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావా? నాది అందరితో చాలా ఫ్రీగా వుండే మనస్తత్వమని నీకూ తెలుసు. స్నేహం చేసేటప్పుడు ఆడా, మగా తేడా చూడను. చదువుకునే రోజుల్లో ఎంజాయ్ చెయ్యకపోతే రేపు యింటికెళ్ళాక భర్త, పిల్లలతో సంసారం జంఝాటంలో పడిపోతాము. ఈ నాలుగు రోజులన్నా నన్ను హాయిగా వుండనియ్యి'' అంటూ తేలిగ్గా తీసిపారేసింది. రాజారావు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తుందనిపించింది.

''మీ వైశాలిని ఓసారి తీసుకురాకూడదూ'' అన్నాను.

''అదిక్కడకెందుకులెద్దూ. వైశాలి నాకూతురని తెలిస్తే నన్నో ముసలమ్మ క్రింద జమకడతారు'' అంది అనూరాధ.

ఆమె అలా అంటే నాకు చాలా బాధ వేసింది. వైశాలి లాంటి కూతురుందని చెప్పుకోవడానికి గర్వపడాలిగాని అనురాధ ఎందుకలా ఫీలవుతుంది.

అనూరాధ స్వతహాగా అందగత్తె అయినా ఆ అందానికి మెరుగులు దిద్దుతూ మేకప్ చేసుకుంటుంది. ఆమెను చూస్తే ఇరవై ఏళ్ళకన్నా ఎక్కువుండవనుకుంటారుగాని ఆమెకు ముప్పయిరెండేళ్ళ వయసు. నాకంటే పదేళ్ళు పెద్దది. అసలు ఆమెకు పెళ్ళయిందని ఏ కొద్దిమందికో తెలుసు. మెళ్ళో మంగళసూత్రాలు కూడా వుంచుకునేదికాదు. ఆమె నడవడికను చెడ్డగా చెప్పుకునేవారు. అయితే ఆ విషయాలేమీ నేను పట్టించుకునేవాడినికాను. ఆమె నాకు మంచి స్నేహితురాలు అంతే.

మొత్తంమీద మా యూనివర్సిటీ చదువు పూర్తయిపోయింది. యూనివిర్సటీ నుంచి వెళ్ళిపోతున్నప్పుడు అనూరాధ చాలా బాధపడింది. ఒక అందమైన జీవితం నుంచి దూరంగా వెళ్ళిపోతున్నందుకు అందరికీ బాధనిపించినా అనూరాధ మాత్రం ఏదో కోల్పోయినట్టుగానే ఫీలయింది.

• • •

ఎమ్మే పూర్తిచేసిన వెంటనే నాకు లెక్చరర్ ఉద్యోగం దొరికింది. అనూరాధ ముందే బి.యిడి పూర్తిచేసి వుండటంతో వాళ్ళ వూళ్ళోనే స్కూలులో టీచరు ఉద్యోగం సంపాదించుకుంది. నేను పెళ్ళి చేసుకున్నాను. పాప కూడా పుట్టింది. అప్పుడప్పుడు మా ఇద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండేవి. వైశాలి టెంత్‌లోకి వచ్చిందని, బాగా చదువుతుందని ఓసారి వ్రాసింది. ఒక వారం క్రితమే అనూరాధ ఉత్తరం వ్రాసింది. రెండు రోజుల్లో టెంత్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, కష్టపడి చదువుతుందని, ఇవి పూర్తయితే మంచి కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్ చేర్పించాలని, ఎమ్‌సెట్ మెడికల్ ఎంట్రన్స్‌కు ప్రిపేర్ చేయించాలని అనుకుంటున్నట్లుగా వ్రాసింది. వైశాలి లాంటి తెలివైన అమ్మాయి తప్పకుండా డాక్టరవుతుందనిపించింది.

పరీక్షలు వ్రాస్తూ మధ్యలో వైశాలి ఎందుకు చనిపోయిందో నాకర్థంకాలేదు. ఏమన్నా అనారోగ్యమా? అలాంటిదేమీ అయివుండదు. వైశాలిది చక్కని ఆరోగ్యం. అనూరాధ కూడా ఎప్పుడూ వ్రాయలేదు. మరి కారణం ఏమై వుంటుంది? అక్కడకు వెళితేనేగాని తెలియదు.

• • •

అనూరాధ వాళ్ళవూరు చేరుకునేసరికి సాయంత్రం అయిదు గంటలయ్యింది. నేను వెళ్ళేసరికి వైశాలి శవం యింటి దగ్గరే వుంది. అనూరాధ తల్లిదండ్రులు రావాలట. అందుకని వుంచారు. నన్ను చూసినవెంటనే వాళ్ళిద్దరి దుఃఖం కట్టలు త్రెంచుకుంది. రాజారావు నా చేతుల్లో ముఖం దాచుకుని బోరుమని ఏడ్చేసాడు. నాకూ దుఃఖం ఆగలేదు. వాళ్ళని ఎలా సముదాయించాలో కూడా తెలియలేదు. తెల్లారి లేచి చూసేసరికి గదిలో ఫేనుకు ఉరివేసుకున్న వైశాలి కన్పించిందట. నిన్న పరీక్ష వ్రాసిన వెంటనే పేపరు సరిగ్గా వ్రాయలేదని, ఆ పేపరులో ఫెయిలవుతానని, స్కూలు ఫస్టు వస్తుందనుకున్న తను పరీక్ష ఫెయిలయితే ఎలా తలెత్తుకు తిరగాలని రోజంతా ఏడుస్తూ కూర్చుందిట. అంతపని చేస్తుందని తాము కలలో కూడా వూహించలేకపోయామని అనూరాధ ఏడుస్తూ చెప్పింది. చనిపోయిన వైశాలి ముఖం చూడలేకపోయాను. బయటకొచ్చిన నాలుక, కనుగ్రుడ్లు- చాలా భయంకరంగా వుంది. ఎన్నో తెలివితేటలున్న వైశాలి ఎంత దారుణమైన చావుని కోరుకుంది. అప్పుడు నాకు వైశాలిమీద చాలా కోపం వచ్చింది. ఇప్పుడు ఫెయిలయితే రేపు సెప్టెంబరులో పూర్తిచేసుకోవచ్చు. ఇంత మాత్రానికే ప్రాణాలు తీసుకోవాలా?

వైశాలిని అయిదున్నరకల్లా శ్మశానానికి తీసుకెళ్ళారు. కూడా నేనూ వెళ్ళాను. నాకళ్ళముందే మట్టిలో కలిసిపోయింది వైశాలి.

మనస్సంతా వికలమయిపోయింది. రెండు రోజులుందామని వచ్చినా ఇంక అక్కడ వుండలేకపోయాను. ఆరాత్రే బయలుదేరి యింటికి వచ్చేసాను.

• • •

పెట్టిన లీవ్ కాన్సిల్ చేసుకుని మర్నాడు కాలేజీకి వెళ్ళాను. పేపరు లేకపోతే స్టాఫ్‌రూములో కూర్చుని పుస్తకం చదువుతున్నాను. పోస్ట్‌మాన్ ఓ ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. ఎక్కడి నుంచబ్బా అనుకుని ఫ్రం అడ్రస్ చూసాను. 'ఫ్రం వైశాలి' అని వుంది. ఆశ్చర్యం కలిగింది. అంటే తను చనిపోయేముందు నాకు ఉత్తరం వ్రాసి పోస్ట్ చేసిందన్నమాట. ఆత్రంగా విప్పాను.

"అంకుల్! ఈ ఉత్తరం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది కదూ. నా అంతిమ యాత్ర పూర్తయ్యాకే మీరీ ఉత్తరం చదువుతారని తెలుసు. ఎవరికీ తెలియని నా చావు రహస్యం మీ ఒక్కరికే తెలియాలి. అందుకే మీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. నేను నిజంగా పరీక్ష సరిగ్గా వ్రాయనందుకే చనిపోయానని అనుకుంటున్నారా? లేదంకుల్. పరీక్ష అనేది కేవలం సాకు మాత్రమే. నా చావు వెనుకాల చాలా కారణముంది. నేను చచ్చిపోదామని నిర్ణయించుకున్నాకే టెన్త్‌క్లాసు పరీక్ష పాడుచేసి అందరికీ నా చావుకి కారణం అదే అనే భావం కల్గించాను. ఈ కారణం వల్లనే చనిపోయాననుకున్నారు కదూ!

అంకుల్! నాకు జీవితంపట్ల ఎన్నో ఆశలుండేవి. భవిష్యత్తు మీద నమ్మకం ఎంతగానో వుండేది. మంచి భవిష్యత్తును పొందడానికి, మంచి జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఎన్నో ప్రణాళికలు వేసుకున్నాను. ఎన్నెన్నో ఊహలు అల్లుకున్నాను. అటువంటి నేను చావుని వరిస్తానని ఎప్పుడూ అనుకోలేదు.

మా అమ్మకు చిన్నప్పుడే పెళ్ళికావడం, వెంటనే నేను పుట్టడం నా దురదృష్టానికి నాంది ఏర్పడిందనుకుంటానంకుల్. మా అమ్మకు చదువుకోవాలనిపించడం, అందంగా చిన్నపిల్లలా కన్పించాలనుకోవడం, దానికి తగ్గట్టుగా ఆవిడ ప్రవర్తించడం ఇవన్నీ నా దురదృష్టాన్ని ఇంకా బలపరచాయి. నేను పెద్దదాన్ని అయ్యేకొద్దీ అమ్మకు గుబులుగా వుండేది. నాఅంత పెద్దకూతురు తనకుందని అందరికీ తెలిస్తే తనని పెద్దవయసున్న దానిలా జమకడతారని అమ్మ భయం. అందుకే నన్ను ఎక్కడికీ తనతో తీసుకెళ్ళేదికాదు. ఎవరైనా క్రొత్తవాళ్ళు, అమ్మ ఫ్రెండ్స్ వచ్చినప్పుడు నన్ను వాళ్ళకంట పడనిచ్చేదికాదు. నేను మానసికంగా ఎంత క్షోభననుభవించేదాన్నో మాటలలో చెప్పలేను.

ఇదేం పాపమోగాని అమ్మకు ముప్పయ్యేళ్ళు పైబడ్డా ఇరవై ఏళ్ళ అమ్మాయిలా కన్పించేది. నాకు పదిహేనేళ్ళు రాకపోయినా పాతికేళ్ళ అమ్మాయిలా కనపడేదాన్ని. తనకి చదువు పిల్లలున్నారని. నా అంత కూతురుందని చెప్పుకోవడానికి ఇష్టం వుండేదికాదు. తమ్ముణ్ణి రెసిడెన్షియల్ స్కూల్లో వేసింది నన్ను కూడా అలా వేసేదేమో! నాన్నగారు నన్ను చూడకుండా ఒక్కక్షణం వుండలేరు. అందుకే నేనింట్లోనే వుండిపోయాను. అమ్మకి చాలామంది స్నేహితులున్నారు. వారిలో మగవాళ్ళు కూడా ఎక్కువే. అందర్నీ యింటికి టీపార్టీలకు, డిన్నర్లకు పిలుస్తుండేది. నాన్నగారు సంస్కారవంతులు. అమ్మనేమీ అనేవారు కాదు. మావూరి లేడీస్ క్లబ్‌కి మా అమ్మ సెక్రటరీగా వుండేది. ప్రెసిడెంట్‌గా మావూరి ఎమ్మెల్యేగారి భార్య వుండేది.

ఓరోజు మా స్కూలుకి ఏనివర్సరీ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేగారొచ్చారు. వారితోపాటు భార్యకూడా వచ్చింది. ఆ సందర్భంగా నిర్వహించిన అన్ని పోటీల్లోను నాకు ఫస్ట్‌ప్రయిజులొచ్చాయి. ప్రయిజుల్ని ఎమ్మెల్యేగారి భార్యచేత ఇప్పించారు. అన్నీ నాకే రావడంతో ఆవిడ "ఎవరమ్మాయివమ్మా" అనడిగారు. నేను "మీ క్లబ్ సెక్రటరీ అనూరాధగారమ్మాయినండి" అని గర్వంగా చెప్పాను. 'నిజమా!' అని ఆవిడ ఆశ్చర్యపోయారు.

మర్నాడు క్లబ్ మీటింగు నుంచి అమ్మ చాలాకోపంగా యింటికి వచ్చింది. నన్ను పిలిచి "మా ప్రెసిడెంటుతో నువ్వేం చెప్పావు?" అనడిగింది.

"నేనేం చెప్పాను, నువ్వు మా అమ్మవని చెప్పాను" అన్నాను.

"చాలామంచిపని చేసావు, పెద్ద ఆరిందాలా? ఎవరు చెప్పమన్నారు నిన్ను. ఈవేళ నేను క్లబ్ మీటింగుకెళ్ళేసరికి నా వయసు మీద అంతా తలోరకంగా మాట్లాడుతున్నారు. అంత కూతురుంది కాబట్టి నన్ను నలభై ఏళ్ళ ముసలమ్మని చేసారు. నువ్వు పుట్టి నా పరువు తీస్తున్నావు. ఇంకా ముందు ముందు ఎన్ని అవమానాలు పడాలో" అంటూ కోపంగా మాట్లాడింది. నా మనస్సు చివుక్కుమందంకుల్.

ఏ తల్లీ పిల్లల విషయంలో అలా ఆలోచించదేమో. మా అమ్మలాంటి మనస్తత్వం వున్నవాళ్ళకి నా అంత కూతుళ్ళుండకూడదంకుల్. అమ్మ ఏ శుభకార్యాలకెళ్ళినా తను ఒక్కర్తే వెళ్ళేదిగాని నన్ను తీసుకెళ్ళేదికాదు. నన్ను తీసుకెళితే తన వయస్సు ఎక్కడ బయటపడిపోతుందోనని భయం. నేను మా అమ్మకు అంతర్గత శత్రువులా తయారయ్యాను. నాలో ఒకరకమైన విరక్తిభావం బయలుదేరింది.

మరోకసారి– అప్పుడు నాన్నగారు వూళ్ళోలేరు. కేంపుకెళ్ళారు. అమ్మ తనకి వంట్లో బావుండలేదని స్కూలుకి లీవ్ పంపేసింది. నేను అమ్మ పనిచేసే స్కూల్లో చదవడం లేదు. ఇంకో స్కూల్లో చేర్పించింది. నేనూ స్కూలుకి వెళ్ళనని చెప్పాను. కాని అమ్మ ఒప్పుకోలేదు. నేను స్కూలుకెళ్ళానన్నమాటేగాని అమ్మకెలా వుందోనని యింటి మీద మనస్సు తిరిగిపోయింది. మొదటి రెండు పిరియడ్లు అయిపోయింతర్వాత ఇంక స్కూల్లో వుండలేక యింటికొచ్చేసాను. వీధి తలుపులు వేసివున్నాయి. లోపల బెడ్ రూము నుంచి ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. అమ్మ పకపకా నవ్వుతుంది. బెడ్‌రూము కిటికీ దగ్గరకెళ్ళాను. ఒక కిటికీ తలుపు కొద్దిగా తీసివుంటే అందులోనుంచి చూసాను. లోపల కనపడిన దృశ్యం చూసి స్టన్ అయ్యాను. అమ్మ నగ్నంగా ఓ పరాయి వ్యక్తి పక్కలో పడుకుని ఆనందంగా కబుర్లు చెపుతోంది.

ఆ స్థితిలో అమ్మను చూస్తే పట్టరాని కోపం వచ్చింది. దేవుడిలాంటి నాన్నగార్ని మోసం చేస్తున్న అమ్మంటే అసహ్యం వేసింది. గట్టిగా "అమ్మా" అంటూ అరిచాను. ఉలిక్కిపడి లేచి గబగబా చీర సర్దుకుని వీధి తలుపులు తీసింది. అమ్మకళ్ళు తీక్షణంగా చూస్తున్నాయి. "నువ్విప్పుడెందుకొచ్చావ్?" కోపంగా అడిగింది.

నాలో ఎప్పుడూ రానంత తెగింపు వచ్చేసింది.

"అసలు నువ్వు చేస్తున్నదేమిటి. అంత వయసు వచ్చింది సిగ్గులేదూ. నాన్నగార్కి ద్రోహం చేస్తావా! ఆయన నీకేం అపకారం చేసారు" గట్టిగా అడిగేసాను.

నా చెంప ఛళ్‌మనిపించింది. "ఏం కూసావ్. నా యిష్టం వచ్చినట్లు నేనుంటాను. నువ్వు నాకడుపున పుట్టి నాకు సుఖ సంతోషాలు లేకుండా చేస్తున్నావు. నిన్ను పుట్టిన వెంటనే పీక నులిమి చంపేసి-అవతల పారేసుంటే ఇప్పుడు నాకీ తిప్పలుండేవికావు" అంటూ నన్ను గట్టిగా పట్టుకుని ఈడ్చుకుంటూ నా గదిలోకి నెట్టి బయట తలుపువేసి తన ప్రియుడితో పాటు బెడ్‌రూములోకెళ్ళిపోయింది.

అంకుల్! ఆరోజు నా హృదయం బద్దలయిపోయింది. పుట్టిన తర్వాత అంతలా ఎప్పుడూ ఏడ్చివుండను. నాకు వెంటనే చావెందుకు రాలేదా అనుకున్నాను. అప్పటి నుంచీ నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. నా ఉనికిని అమ్మ అసలు భరించేదికాదు. అంకుల్ అప్పుడే నిశ్చయించుకున్నాను. నేను చచ్చిపోవాలని. ఏకారణం లేకుండా చచ్చిపోతే నామీద నానా రకాలుగా నిందలు వేస్తారు. కాలు జారిందనో, కడుపొచ్చిందనో, ప్రేమించిన వాడు మోసం చేసాడనో ఇలా రకరకాలుగా చెప్పుకుంటారు. అది నాకిష్టంలేదు. అందుకే పరీక్షలను సాకుగా తీసుకున్నాను. ఆత్మాహుతి చేసుకోవడానికి నిర్ణయించుకున్నాను. కావాలని ఈరోజు పరీక్ష పేపరు సరిగ్గా రాయకుండా ఒకరకమైన వాతావరణాన్ని సృష్టించాను. ఇప్పుడే మీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

అంకుల్! నా చావు రహస్యం మీకు తప్ప ఎవరికీ తెలియకూడదు. అమ్మ కారణంగా నేను చచ్చిపోయానంటే నాన్నగారు అమ్మని చంపి తను చచ్చిపోతారు. అందుకే తెలియనివ్వలేదు. ఈ విషయం మీలోనే దాచుకోండి.

అంకుల్! నాకొద్దిపాటి జీవితం నాకు రెండు అదృష్టాలనిచ్చింది. ఒకటి నాన్నలాంటి ఉత్తమ వ్యక్తికి కూతురుగా పుట్టడం, రెండోది మనస్సు విప్పి చెప్పుకోవడానికి మీలాంటి ఆప్తులు లభించడం. అందుకే నా మనస్సులోని విషయాలను, ఎవరికీ తెలియని రహస్యాన్ని మీముందుంచాను.

నేను చేస్తున్నది తప్పో, ఒప్పో నాకు తెలియదు. కాని నాకింక బ్రతకాలని లేదు. అంత విరక్తి కలిగింది జీవితమ్మీద. మీరైనా నన్ను అర్థం చేసుకుంటారని ఆశిస్తాను. అదే నా ఆత్మకు శాంతి. కనీసం అప్పుడప్పుడైనా ఈ అభాగినిని గుర్తు తెచ్చుకుంటారు కదూ! ఇంక శెలవంకుల్. చనిపోయేముందు మీతో మనస్సువిప్పి చెప్పుకున్నానన్న తృప్తి నాకు దక్కింది. అది చాలంకుల్."

ఉత్తరం పూర్తిచేసిన నా కళ్ళనిండుగా నీళ్ళు!

'అమ్మా వైశాలీ నువ్వెంత దురదృష్టవంతురాలివమ్మా' అనుకుంటూ బాధగా కళ్ళు మూసుకున్నాను. నాకళ్ళలోని నీళ్ళన్నీ నా చంపల్ని తడిపేసాయి.

★